ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025
5
అనంతపురం

ఓబుళాపురం ఓఎంసి గనుల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎఫ్ఒ, తదితరులు

ఓబుళాపురం మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన డిఎఫ్ఒ

ప్రజాశక్తి - డి. హీరేహాల్

మండలంలోని ఓబులాపురం గ్రామ పరిధిలో ఉన్న ఓబులాపురం మైనింగ్ గనుల ప్రాంతాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి శనివారం పరిశీలించారు ఒఎంసీలు సిబిఐ సీజ్ చేసిన ఇనుప ముడి ఖనిజాన్ని అక్రమంగా తరలించారని వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. సిబిఐ ఇనుప గనుల్లో సీజ్ చేసిన ఖనిజాన్ని అక్రమంగా తరలించారన్న ఆరోపణలు రావడంతో అటవీశాఖ అధికారులు ఓఎంసీ గనుల ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ సిబిఐ సీజ్ చేసిన ఖనిజం అటవీ శాఖ పరిధిలో ఉందా లేక సిబిఐ పరిధిలో ఉందా అన్న విషయంపై పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే తగు చర్యలు చేపడతామనితెలిపారు ఈ పరిశీలనలో కళ్యాణదుర్గం ఎఫ్ఆర్ఒ శ్రీరాములు, రాయదుర్గం ఎఫ్ఆర్ఒ దామోదర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా అనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు

హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే మార్గం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ఘనంగా ప్రారంభమైన సిఐటియు 11వ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మిక రాజ్యం స్థాపనతోనే సమాజానికి రక్షణ ఉంటుందని అది సాధించడమే లక్ష్యంగా కార్మిక వర్గం ముందుకు సాగాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు 11వ జిల్లా మహాసభలు అనంతపురం జిల్లా కేంద్రంలోని సాయినగర్ ఆపిల్ ఫంక్షన్‌హాల్, కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అనంతపురం మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను సిఐటియు సీనియర్ నాయకులు ఏజీ.రాజమోహన్ ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు ఆఫీస్ బేరర్స్ ఎం.నాగమణి, సాకే నాగరాజు, శ్రీనివాసులు అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మికులకు సంతాప తీర్మాణాన్ని కమిటీ సభ్యులు గోపాల్ ప్రవేశపెట్టగా సభలో ప్రతినిధులు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, పెట్టుబడిదారీ విధానాలు అమలు చేస్తూ కార్మికులు, శ్రామికులను వెట్టి చాకిరిలోకి నెట్టివేస్తూ శ్రమ దోపిడీ చేయించేందుకు సిద్ధమయ్యాయని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మిక వ్యతిరేకులని విమర్శించారు. సంపద సృష్టికర్తలైన కార్మికులను ప్రోత్సహించాల్సింది పోయి పెట్టుబడిదారులకు దాసోహమై లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రమజీవులతోనే సమాజం మనుగడ సాగిస్తోందన్నారు. వారిని ప్రోత్సహించాల్సింది పోయి మరింత ఇబ్బందుల్లో నెట్టేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. బ్రిటీష్ పాలనలో కూడా నిత్యావసర వస్తువులపై సుంకాలు వేయలేదని సంపన్నులకు మాత్రమే విధించే వారని అన్నారు. అయితే మోడీ ప్రభుత్వం నిత్యావసరాలపై పన్నులు విధించి ఇప్పుడు తగ్గిస్తోందన్నారు. పిపిపి విధానంతో పేదరికం లేకుండా చేస్తానంటూనే మరింత పేదరికంలోకి నెట్టివేసే విధానాలు అనుసరిస్తున్నాడని విమర్శించారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం అందడం లేదన్నారు. ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఆశాలు, అంగన్‌వాడీలు, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు కనీస సదుపాయాలు పొందుతున్నారంటే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్నవే అని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ కాకుండా కార్మికులు పోరాడి నిలబెట్టారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా 13 గంటల పని విధానం అమలు చేయడానికి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణించడం కార్మిక లోకానికి నష్టదాయకమన్నారు. ఈ విధానాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. 8 గంటల పని విధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్, ఉచిత విద్య, వైద్యం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 31, జనవరి 1,2,3,4 తేదీల్లో విశాఖపట్టణంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగనున్నాయని భవిష్యత్ పోరాట కార్యచరణ అందులో రూపొందిస్తామని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడమే సిఐటియు ఏకైక లక్ష్యం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అనేక పోరాటాలు చేశామన్నారు. శ్రీరామిరెడ్డి, ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు, ఉపాధి కూలీలు, ఆటో కార్మికుల సమస్యలపై పోరాడామన్నారు. శాశ్వత పనులకు శాశ్వత ప్రాతిపదికన కార్మికులను నియమించాలన్నారు. కార్మికుల హక్కుల సాధనకు భవిష్యత్ పోరాటాలకు ఈ రెండు రోజుల మహాసభల్లో కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మినిట్స్ కమిటీ సభ్యులుగా గోపాల్, రమాదేవి, శివప్రసాద్, అర్హతల కమిటీ సభ్యులుగా శకుంతల, ఆర్వి నాయుడు, నరసింహారెడ్డి తమ బాధ్యతలను నిర్వర్తించారు ఈ మహాసభలకు మద్దతుగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఆఫీస్ బేరర్స్ ఆర్‌వి.నాయుడు, ముర్తుజా, వెంకటనారాయణ, గోపాల్, రామాంజినేయులు, రమాదేవి, శకుంతల, నాగభూషణ, జగన్‌మోహన్, శివప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, సాకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు హాజరైన ప్రతినిధులు

ఎలివేషన్ గోడ పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గుంతకల్లు

గోడ కూలడంతో స్కూటీలోనే మృతిచెందిన వెంకటరమణ

పట్టణంలోని కూరగాయల మార్కెట్ వన్‌వే ట్రాఫిక్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంకటరమణ (58)పై ఎలివేషన్ గోడ పడి శనివారం అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో నివాసం ఉంటూ చిన్న కిరాణా వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగానే అంగడికి కావాల్సిన సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. అయితే మార్కెట్టుకు దగ్గరలో ఓ యజమాని పాత భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మిస్తున్న ప్రాంతానికి రాగనే ఒక్కసారిగా ఎలివేషన్ గోడ కూలి వెంకటరమణపై పడింది. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య ఉమాదేవి, కొడుకు మోహన్‌కృష్ణ ఉన్నారు. కుటుంబ యజమాని అకాల మరణంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని పాత ఆర్‌డిఒ కార్యాలయం ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తలుపులకు వేసిన సీల్లను పరిశీలించిన అనంతరం సీల్‌ను తెరిపించి లోపలికి వెళ్లి ఈవీఎంలు, వి.వి.ప్యాడ్‌లు ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను కలెక్టర్ పరిశీలించి తిరిగి గోడౌన్‌ల తలుపులకు సీల్ వేయించారు. అనంతరం గౌడౌన్ తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గోడౌన్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, గోడౌన్ గదులతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనుమతి లేనిదే గౌడౌన్ లోపలికి ఎవరిని కూడా అనుమతించరాదని అధికారులను, సెక్యూరిటీ గార్డులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరా, వర్షపు నీటి నిలువ తదితర అంశాలపై దృష్టిని సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కేశవ నాయుడు, ఎన్నికల విభాగం డిప్యూటీ తాశీల్దార్ కనకరాజు, కలెక్టరేట్ సూపరిండెంట్ యోగేశ్వరీదేవి, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ తేజ, టిడిపి నాయకులు పవన్‌కుమార్, సిపిఎం నాయకులు బాల రంగయ్య, బిజెపి నాయకులు ఈశ్వరప్రసాద్, జనసేన నాయకులు కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన

ఆత్మకూరు : మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పండ్ల మొక్కల పెంపకం, పశువుల షెడ్, రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, పశువుల నీటి తొట్టె, తదితరాలను డ్వామా పీడీ సలీంబాషాతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, ఎపిఒ వెంకటనారాయణ, ఇసి బబ్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీని నిలబెట్టేరా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాతో పెనవేసుకున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) నిలబెడుతామని ప్రకటనలు ఈ వారంలో జోరుగా వచ్చాయి. అయితే ఈ ప్రకటనలు కార్యరూపం దాల్చాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఎందుకంటే ప్రజల కష్టాలు, సుఖాల్లో తోడుగా నిలుస్తున్నది ఆ సంస్థయే. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన దాని మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రాబోయే రోజుల్లో యధావిధిగా ఇది కొనసాగుతుందా శాశ్వతంగా జిల్లా నుంచి కనుమరుగవుతుందా అన్న ఆందోళన సామాన్యుల్లో ఉంది. ఈ కారణంగానే గత వారంలో పెద్దఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ప్రజలు తరలొచ్చారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లో ఆర్డీటీ ఎఫ్ఆర్‌సిఎ పునరుద్దరణ చేపట్టాలని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించారు. ఆర్డీటీ సేవలు యధావిధిగా కొనసాగుతాయని హామీ కూడా ఇచ్చారు. అయితే ఇది రాష్ట్రం చేతుల్లో లేదన్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం దీన్ని పునరుద్ధరించాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలకు విదేశీ విరాళాల రాకపై అడ్డుకట్ట వేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంది. ఈ క్రమంలోనే ఆర్డీటీపైనా వేటు వేసింది. పాత లైసెన్సు అయితే రద్దయినట్టేనని అధికారపార్టీ నేతలు కూడా చెబుతున్నారు. అయితే ఇక్కడి డిమాండ్ రీత్యా కొత్తగా ఆ సంస్థకు లైసెన్సును జారీ చేయనున్నట్టు ప్రకటిస్తున్నారు. ఇది ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో దీనిపై విపక్షాలు పోరాటానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఆర్డీటీని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కూటమిలో టిడిపి భాగస్వామిగా ఉన్నందున చర్యలు తీసుకుకోవాలని బిజెపిపై ఒత్తిడి చేయాలన్న డిమాండ్ ప్రధానంగా ఉంది. పార్టీలకు అతీతంగా ఉద్యమించేందుకు కార్యచరణ కూడా సిద్ధమైంది. ఇక ఈ వారంలో ముందుకొచ్చిన అంశాలు చూస్తే తిరిగి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితులున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం ఈ రంగాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు రాజకీయంగా నడుస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోలేదు. సెప్టెంబరులో ఆరంభంలో మంచి వర్షాలు పడి పదును అయినా ప్రత్యామ్నాయ విత్తనాలివ్వకపోవడంతో పంటల సాగు ఆశించినంత జరగలేదు. రబీ సాగు పరిస్థితి కూడా అయోమయంగానే ఉంది. ఇంకా యూరియా సమస్యలు అక్కడక్కడ కొనసాగుతూనే ఉన్నాయి. తగినంత అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంటలకు సరైన గిట్టుబాటు ధర ఉండటం లేదు. మొక్కజొన్న పంట నూర్పిడి దశకు వచ్చింది. పంట చేతికొచ్చాక ధర అమాంతంగా పడిపోయింది. ఒక వైపు టమోట ధర తగ్గుతుండగా, మరోవైపు ఉల్లి ధర పడిపోయింది. తాజాగా అరటి పంటకు కూడా ధరలేదని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర కల్పించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కొర్రపాడులోని సంక్షేమ వసతిగృహంలో పాలల్లో పడి 17 నెలల చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన ఈ వారంలో చోటు చేసుకుంది. అంతక మునుపు గుత్తిలోనూ ఒక ఉద్యోగి రాత్రి విధుల్లో ఉండగా బాలుడు గొంతులో వాటర్ బాటిల్ మూత పెట్టుకుని చనిపోయిన ఘటన చోటు చేసుకుంది. వరుసగా ఇవి జరగడం శోచనీయం.

పిహెచ్‌సి వైద్యుల సమ్మెబాట

- సమస్యలు పరిష్కరించాలంటున్న డాక్టర్లు
- నిరసన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రకటన
- వైద్య సేవలు అందక అల్లాడుతున్న గ్రామీణులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక గ్రామీణ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం తమకేమీ ఎరగనట్లు వ్యవహరిస్తోంది. తమ కనీస సమస్యలు పరిష్కరించాలని వైద్యులు కోరుతున్నారు. తమ నిరసన ప్రజలపై కాదని ప్రభుత్వ నిర్లక్ష్యంపైనే అని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో వారు తమ నిరసన కార్యాచరణను ప్రకటించారు. 26న ప్రభుత్వానికి ఆన్ లైన్ ద్వారా అందజేయాల్సిన రిపోర్టులను బంద్ చేశారు. 27న 104 సంచార చికిత్స సేవలు బంద్ చేయడం 29న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓపి సేవలను నిలిపివేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూసే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈనెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి అప్పటికి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ మూడవ తేదీ నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడానికి వైద్యులు సిద్ధమయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా విద్య... వైద్య సేవల్లో నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలడంతో సగటున ఇంటికొక్కరు జ్వరంతో మంచం పట్టారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యహరించారు. దీంతో వీధి లేని పరిస్థితుల్లో పిహెచ్‌సిల్లో పనిచేసే వైద్యులు సమ్మెబాట పట్టారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 50, సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 47 ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈనెల 26వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా 26న ప్రభుత్వానికి ఆన్ లైన్ ద్వారా అందజేయాల్సిన రిపోర్టులను బంద్ చేశారు. దీంతోపాటు 104 సంచార చికిత్స సేవలు బంద్ చేయడం 29న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓపి సేవలను నిలిపివేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూసే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈనెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి అప్పటికి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ మూడవ తేదీ నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడానికి వైద్యులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా జీవో నెంబర్ 99 తీసుకొచ్చి రద్దు చేసిన ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్దించాలని డాక్టర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్దించాలని, టైం బంద్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు బేసిక్ పే 30శాతం, ట్రైబల్ అలవెన్స్, నేటివిటీ అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు వైద్యులకు ఖచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులు, స్పష్టమైన జాబ్ కార్డు ఇవ్వడం, నాన్ మెడికల్ వ్యక్తులు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలన చేయకుండా మార్గదర్శకాలు విడుదల చేయాలని వైద్యులు కోరుతున్నారు. కరోనా విపత్కర సమయంలో సైతం వెనకడుగు వేయకుండా ప్రజలకు వైద్య సేవలను అందించిన వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వారు అంటున్నారు.

సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

వైద్యానికి దూరమవుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యానికి దూరమవుతున్నారు. ఇప్పటికే వాతావరణంలో తీవ్ర మార్పులు రావడంతో ఇంటికొకరు జ్వరాల బారిన పడ్డారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు చొప్పున వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరందరూ సోమవారం నుంచి విధులను బహిష్కరించి, కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూస్తామని ప్రకటించారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మె

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం స్పందన లేదు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నాం. ఈ నిరసన ప్రజలపై కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యం పైనే.

డాక్టర్ దిలీప్,
ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

'అమ్మ' ఆసుపత్రిపై విచారణ

విచారణ చేస్తున్న డిఎంహెచ్ఓ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని అమ్మ ఆసుపత్రిపై డిఎంహెచ్ఓ ఇబి దేవి శనివారం విచారణ చేపట్టారు. ఈనెల 20వతేదీన నగరంలోని 5వ రోడ్డులో హనుమాన్ కాలనీకి చెందిన శిరీషా చికిత్స కోసం అమ్మ ఆసుపత్రికి వచ్చింది. ఈ సందర్భంగా గైనకాలజిస్టు డాక్టర్ శివజ్యోతి ఆపరేషన్ చేసి మగబిడ్డకు కాన్పు చేసింది. అయితే పుట్టిన బాబు అనారోగ్యంగా ఉండటంతో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో అక్కడ చేర్పించారు. అయినా బాగులేకపోవడంతో 24వతేదీన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ విషమించి 25వతేదీన చిన్నారి మృతిచెందాడు. తీవ్ర మనస్థాపానికి గురైన తల్లిదండ్రులు, బంధువులు అమ్మ ఆసుపత్రి డాక్టర్ శివజ్యోతి నిర్లక్ష్యమే కారణమని ఆందోళనకు దిగారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిఎంహెచ్ఓ దేవి ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డిఎంహెచ్ఓ తెలిపారు.

'సూపర్ జిఎస్‌టి'పై అవగాహన కల్పించాలి

టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, జడ్పీ సీఈఓ శివశంకర్, డిపిఒ నాగరాజు నాయుడు, డ్వామా పీడీ సలీంబాషా, తదితరులతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలు చేస్తున్న జిఎస్‌టి 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేయడానికి సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిఎస్‌టి క్యాంపెయిన్‌కు జిల్లా నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఉంటారన్నారు. మండల, మున్సిపల్ స్థాయిలో ఇతర శాఖల అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు సమన్వయం చేసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్‌తో అధికారులందరూ జడ్పీ సిఇఓ, డిపిఓ లు సమన్వయం చేసుకొని రోజువారీ యాక్టివిటీలను చేపట్టడంపై దృష్టి సారించాలన్నారు. మొదటి వారం సెప్టెంబరు 25 నుంచి అక్టోబర్ 1 వరకు మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ స్థాయిలో ఆర్పీలు, ఏపిఎంలు, సిసిలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామ సభల్లో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. రెండవ వారం అక్టోబర్ 2 నుంచి 8 వరకు వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ట్రాక్టర్, ర్యాలీల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యాసంస్థలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. మూడవ వారం అక్టోబర్ 9 నుండి 15 వరకు మున్సిపల్, పంచాయితీ రాజ్, సాంఘిక సంక్షేమ శాఖల ద్వారా ప్రచారం చేయడంతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఆసుపత్రుల పరిధిలో జిఎస్టీ 2.0 పై అవగాహన మేళాలను డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. నాలుగవ వారం అక్టోబర్ 16 నుండి 19 వరకు టూరిజం, రవాణా, విద్యుత్ శాఖలు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 29న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహారాజరాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, అనంతపురము.
I.A.No.613/23 in O.S.NO.1799/2023 మరియు O.S.1799/23
Between:
బి.నరేష్ కురమార్ మరియు ఇంకొకరు ...వాదులు
మరియు
ఎస్.కేశవాచారి మరియు ఇతరులు ...ప్రతివాదులు
1) ఎస్.కేశవాచారి, S/o ఎస్.శంకరనారాయణచారి, వ్యాపారం, D.No.28-354-A, భోయవీధి, ఓల్డ్ టౌన్, అనంతపురం.
2) శ్రీమతి టి. రమాదేవి, W/o లేట్ టి. గోపాల్ నాయుడు, D.No.18-12, Renuka Gated Community, JNTU రోడ్, అనంతపురం.
4) చాకలి కుమార్, S/o అంకాలప్ప, D.No.19-412, రాణినగర్, అనంతపురం.ం
పై దావాలోని 1వ,2వ మరియు 4వ ప్రతివాదులు కోర్టులో హాజరు నిమిత్తం 14-10-2025 తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. కావున మీరు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కాని హాజరై అక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల దావా మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
శ్రీ K.L.N ప్రసాద్
అడ్వకేట్, అనంతపురము

IN THE COURT OF THE IInd ADDL JUNIOR CIVIL JUDGE ANANTHAPURAMU
I.A.NO:833/2024 in O.S NO: 1229/2019
Between:
E.Chinna Polanna ...Petitioner /Plaintiff
AND
J.Narayanamma (Died) by her L.Rs J.Narayana Swamy and others ...Respondants/ Defendants
NOTICE TO THE RESPONDANT NO:2&3
R2: J.Swarnalatha, W/o Chandra, D/o Late J.Narayanamma, Employee.
R3: J.Indira, W/o Murali, D/o Late J.Narayanamma, Employee,
Both are residing at D.No.28-1-465, Buddappa Nagar, Opp. Rajendra Municipal High School, Anantapuramu
పై నెంబరు కేసులో Respondant's అయిన మీ హాజరు నిమిత్తము 7-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
N.P.SREENIVASULU ,
K.JAGADEESWAR REDDY,
Advocates, Ananthapuramu,
Cell: 9440753607

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
E.A. No.241/2024 in E.P. No.31/2016 in O.S.No.206/1979
Between:
K.Ramakrishna Reptd., by his G.P.A.Holder Kummara Prabhakar ...Claim Petitioner
AND
Ammisetty kanthamma (died by L.Rs.)& others. ...Respondents/D.Hr/J.Drs
NOTICE TO THE J.DR.NO:5
J.Dr5: Uma Maheswari W/o Dr.Mallesappa, D.No.4/401, 4th Road, Ananthapuramu now residing at D.No.1/398-A, Kothacheruvu village & Mandal.Sri Sathya Sai Dist.
పై నెంబరు కేసులో 5వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 06-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
D.SHYAM SUNDER, K.MOHAN RAO,
Advocates, Ananthapuramu,
Cell: 9440258700

మహారాజరాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
I.P.No.33/2025
Between:
జంగాలి నాగరత్నమ్మ ...వాది
మరియు
కురువ అశ్వర్థ మరియు ఇతరులు ...ప్రతివాదులు
3వ ప్రతివాదికి నోటీసు
దేవర ఎర్రిస్వామి, తండ్రి దేవర నారాయణప్ప, నివాసం: పాలచెర్ల గ్రామము, రాప్తాడు మండలం, అనంతపురము జిల్లా.
ఇందుమూలముగా 3వ ప్రతివాదికి తెలియజేయడమేమనగా, పై వాది మీపై పైకేసును దాఖలు చేసినారు. 3వ ప్రతివాది అయిన మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుటకు పై కేసును 08-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 08-10-2025
ఇట్లు
శ్రీ భాస్కర్ రవిప్రసాద్
వాదిపరం న్యాయవాది, అనంతపురము

మహారాజరాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
E.P.No.54/2025 in O.S.No.40/2023
Between:
చిన్నారెడ్డి గంగాధరరెడ్డి ...డిక్రీ హెూల్డరు
మరియు
మేడం ఓబయ్య మరియు ఇతరులు ...జడ్జిమెంట్ డెటార్స్
జడ్జిమెంట్ డెటార్స్‌కు నోటీసు
1) మేడం ఓబులయ్య, తండ్రి మేడం నడిపి నరసింహయ్య,
2) మేడం సాగర్, తండ్రి మేడం ఓబులయ్య,
3) మేడం మహిమ, తండ్రి మేడం ఓబులయ్య,
అందరి నివాసం: డోర్ నెం.4/1774/7/డి, భాగ్యనగర్, శ్రీ బాలాజీ నిలయం, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురము పట్టణం మరియు జిల్లా.
ఇందుమూలముగా జడ్జిమెంట్ డెటార్స్ అయిన మీకు తెలియజేయడమేమనగా, పై డిక్రీహెూల్డర్ మీపై పైకేసును దాఖలు చేసినారు. మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుటకు పై కేసును 17-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 17-10-2025
ఇట్లు
శ్రీ భాస్కర్ రవిప్రసాద్
వాదిపరం న్యాయవాది, అనంతపురము

పన్ను వసూళ్లపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను, నీటి కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ జి.నాగరాజు సంబంధిత మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయం, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరులోగా 90శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలలో పన్ను వసూలు ఎక్కువగా ఉంటాయన్నారు. అయితే డిసెంబర్‌లోగా 90 శాతం పన్ను వసూళ్లు చేస్తే ఇతర అంశాలపై దృష్టి కేంద్రీకరించవచ్చన్నారు. ప్రస్తుతం రాయదుర్గం పురపాలక సంఘం అన్ని విషయాల్లో బేరీజు వేస్తే రాష్ట్రస్థాయిలో 72వ స్థానం, అనంతపురం జిల్లాలో 5వ స్థానంలో ఉందన్నారు. అలాగే అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి ఆర్థిక అంశంతో ముడిపడి ఉందన్నారు. అమృత్ 2.0 అమలుపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు దినసరి వేతన ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించి, మురికి కాలువలో పూడిక తీసివేత పనులు చేపట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులు బదిలీపై వెళ్లినందున డిప్యూటేషన్‌పై ఇక్కడ పని చేయడానికి వచ్చే వారిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం వహించి ఓ చిన్నారి ప్రాణాలు పోయేందుకు కారణమైన వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యాధికారుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపించారు. మృతిచెందిన చిన్నారి ఉరవకొండలోని ప్రయివేట్ ఆస్పత్రిలో 2, 3రోజులపాటు చికిత్స చేయించుకున్నట్లు బంధువులు తెలిపారన్నారు. నియోజకవర్గంలో పేరుకే 50 పడుకుల ఆసుపత్రిగా ఉంది కానీ ఆసుపత్రిలో వైద్యుల సేవలు మాత్రం శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ 12 గంటలు దాటిన తర్వాత ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. తర్వాత నర్సులే వైద్యం చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీనప్ప, కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, రైతు సంఘం నాయకులు రవికుమార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల గ్రంథాలయంలో 'స్వచ్ఛత'

శ్రమదానం చేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

నార్పల : స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణను శనివారం శుభ్రం చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయ సిబ్బందితో కలిసి జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు పరిసరాలను శుభ్రం చేశారు. తర్వాత గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ శైలజారాణి, సర్పంచు మనీలా సుప్రియ, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, గ్రంథాలయ అధికారి కావేరి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తలకు అండగా నిలవడానికే డిజిటల్ బుక్ ఓపెన్ చేశామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి 'డిజిటల్ బుక్' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా అరాచకపాలన సాగుతోందన్నారు. వైసిపి హయాంలో పని చేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ అనాగరికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే సోషల్ మీడియా యాక్టివిస్ట్ సవీంద్రారెడ్డిపై అక్రమ కేసు పెట్టారన్నారు. ఎప్పటికప్పుడు కోర్టులు అక్షింతలు వేస్తున్నా ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. ఈనేపథ్యంలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ విషయాన్ని అధినేత జగన్ కూడా ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. అందుకోసమే ఎవరికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో బాధితులు ఎవరైనా సరే 'డీబీ.డబ్ల్యూఈవైఎస్ఆర్‌సీపీ.కామ్' అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చు. అదేవిధంగా 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ఇకపోతే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఓ ఉన్మాదిలా అసెంబ్లీలో మాజీ సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. ఆయన పేరు కూడా డిజిటల్ బుక్‌లో నమోదువుతుందన్నారు.

గాంధీజీ..అంబేద్కర్‌గారూ..

మీరైనా మామొర ఆలకించండి..

విగ్రహాలకు సచివాలయ ఉద్యోగుల వినతులు

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'జాతిపిత మహాత్మాగాంధీజీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంబేద్కర్‌గారూ.. మీరైనా మామొర ఆలకించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించండి' అంటూ సచివాలయ ఉద్యోగులు వేడుకున్నారు. జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం అనంతపురం కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, అరియర్స్ ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యోగోన్నతులు, మాతృ శాఖ విభాగం ప్రకారం జాబ్ చార్ట్ ఏర్పాటు చేయాలన్నారు. ఆరేళ్ల పూర్తయిన ప్రతి ఉద్యోగికీ ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం మంజూరు చేయాలని, డోర్ టు డోర్ సర్వీస్ అందజేసే విధానానికి స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సుధాకర్, మల్లికార్జున, చంద్ర, వరప్రసాద్, రామకృష్ణ, శివశంకర్, వీరనారప్ప, హనుమంతు, ముత్యాలు, మంజునాథ్, మృదుల, శంకర్‌రెడ్డి, విద్యాసాగర్, నరేష్, చిన్నారప్ప, కిషోర్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇనుప ఖనిజం చోరీపై చర్యలు తీసుకోండి

అసెంబ్లీలో విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఓబులాపురం మైనింగ్ కంపెనీ ప్రాంతంలో సిబిఐ సీజ్ చేసిన లక్ష మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం చోరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో విప్ మాట్లాడుతూ 2019- 24 కాలంలో ఓఎంసి క్వారీ ప్రాంతంలో సిబిఐ సీజ్ చేసిన లక్ష మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని వైసిపి చెందినవారు చోరీ చేశారన్నారు. ఈ ఖనిజం విలువ రూ.30 కోట్లు ఉంటుందని పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లను అసెంబ్లీలో ప్రదర్శించారు. ఎవరైతే చోరీ చేశారో అలాంటి గజదొంగలు కూటమిలో ఉంటూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిబిఐ సీజ్ చేసిన హిటాచి, ఇతర యంత్రాలు, పరికరాలు, వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేస్తే ఓఎంసీకి వాహనాలు సరఫరా చేసిన వ్యక్తి ఈ వాహనాలను చోరీ చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఎవరు ఇనుప ఖనిజాన్ని దోచారో సమగ్రమైన విచారణ చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా దోచినవారు వివిధ మాధ్యమాల ద్వారా కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఖనిజం అక్రమ రవాణాపై విచారణ హర్షణీయం

మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓబులాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి సిబిఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజం అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలని విప్ కాలవ శ్రీనివాసులు అసెంబ్లీలో కోరడాన్ని స్వాగతిన్నామని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. కాలవ శ్రీనివాసులు 2024లో రాయదుర్గం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక జూలైలో ఓబుళాపురం ఇనుప గనుల నుంచి అక్రమంగా తరలించిన ఖనిజంతోపాటు సెప్టెంబర్ 20, 21, 22వతేదీల్లో జరిగిన ఇనుప ఖనిజం దోపిడీపై కూడా అసెంబ్లీలో అడిగి ఉంటే బాగుండేదన్నారు. గతేడాది జూలైలో ఇనుప ఖనిజం దోపిడీపై వెలుగులోకి వచ్చాక కాలవ తనకు అనుకూల మీడియాలో వార్తా కథనాలు రాయించారన్నారు. ఆ సమయంలో కాలవ కాకుండా ఇంకెవరైనా దోపిడీ చేసే అవకాశం ఉందా.. అని ప్రశ్నించారు. తన దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు కథలు అల్లారన్నారు. రెండు, మూడు రోజుల్లో మీడియా సమక్షంలో ఒక తేదీ నిర్ణయించి ఓఎంసి గనుల ప్రాంతాన్ని సందర్శిస్తే తాను కూడా అక్కడికి వస్తానని అప్పుడు వాస్తవాలు తెలుస్తామన్నారు. ఓఎంసీలు ఇనుప ఖనిజం దోపిడీపై విచారణ చేయాలని తాను గతంలోనే సిబిఐకి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా కాలవ ఎమ్మెల్యే అయ్యాక అక్రమ దందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేష్ గ్రహించాలన్నారు.

మహారాజరాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
I.P.No.2/2025
Between:
కానా రామిరెడ్డి మరియొకరు ...వాదులు
మరియు
పుట్టపర్తి రామాచారి మరియు ఇతరులు ...ప్రతివాదులు
మొదటి మరియు రెండవ ప్రతివాదులకు నోటీసు
1) పుట్టపర్తి రామాచారి, తండ్రి పి. రామచంద్రాచారి,
2) పుట్టపర్తి లక్ష్మణాచార్, తండ్రి పి.రామచంద్రాచారి,
ఇద్దరి నివాసం: ఇంటి నెం.22-152, మహల్దార్ స్ట్రీట్, అనంతపురము పట్టణం మరియు జిల్లా,
ఇందుమూలముగా మొదటి మరియు రెండవ ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడమేమనగా, పై వాది మీపై పైకేసును దాఖలు చేసినారు. మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుటకు పై కేసును 09-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 09-10-2025
ఇట్లు
శ్రీ భాస్కర్ రవిప్రసాద్
వాదిపరం న్యాయవాది, అనంతపురము

ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి

వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ

ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రైతులకు పంట నష్టం జరిగిన వివిధ రూపాల్లో ఆదుకునే విధానాల కోసం చేపట్టే ఈ-క్రాప్ బుకింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ సూచించారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో ఎడిఎ యల్లప్ప, ఏఓలతో కలిసి ఆర్ఎస్‌కె సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. 2025 ఖరీఫ్‌లో సాగైన ప్రతిరైతు పంటపొలాన్ని ఆర్ఎస్‌కే సిబ్బంది సందర్శించి క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఖరీఫ్‌లో సాగైన విస్తీర్ణాల అనుగుణంగా పరిశీలిస్తే ఇప్పటి వరకు 62 శాతం క్రాఫ్‌బుకింగ్ జరిగినట్లు నివేదికలు ఉన్నాయన్నారు. మిగిలిన 35 శాతం క్రాప్ బుకింగ్‌ను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఏఓలు శ్రావణ్‌కుమార్, వాసుకీరాణి, గోపాల్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం డివిజన్ పరిధిలోనిరాయదుర్గం, కణేకల్, బొమ్మనహాల్, డి.హీరేహాల్ మండలాల్లో చేపట్టిన ఈపంట నమోదును జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. ఈ వ్యవసాయ అధికారులు జగదీష్‌బాబు, అహ్మద్‌బాషా, సాయికుమార్, కృష్ణకిషోర్, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనుల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి శనివారం పరిశీలించారు. ముందుగా స్థానిక రహమత్ నగర్‌లో చెత్త తరలింపు వాహన డ్రైవర్‌తో మాట్లాడారు. తర్వాత టవర్‌క్లాక్, కమలానగర్, కోర్టు రోడ్డు, రామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. అక్కడి నుంచి శ్రీనివాస నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా అల్పాహారం తింటున్న వారితో నేరుగా మాట్లాడి క్యాంటీన్ నిర్వాహకుల సేవలపై ఆరాతీశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అందించే ఆహార విషయంలో స్వచ్ఛత నియమాలు, నాణ్యతాప్రమాణాలు పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. తర్వాత క్యాంటీన్ పరిసరాలను పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి : ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపి ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, అబ్జర్వర్ నాగ పీరయ్య, మండల అధ్యక్షులు ఆర్.ఎస్.రంగారావు అన్నారు. శనివారం పట్టణంలోని థామస్ మన్రో సత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిపియుఎస్ఎంఎ కార్యాలయాన్నిప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో గుత్తి ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.షేక్షావలి, కార్యదర్శి డి.రామకృష్ణ, నాయకులు ఇక్బాల్, జి.గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, సి.యోగేందర్, కోనంకి కృష్ణ, విద్యాధర్, ప్రసాద్, పి.కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని వినతి

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ పరిధిలోని మిడ్‌పెన్నార్ ఆధునీకరణ, జల్‌జీవన్ మిషన్‌ను పునరుద్ధరించడంతోపాటు నీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని యల్లనూరు, పుట్లూరు మండలాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. గండికోట – పుట్లూరు – సుబ్బరాయసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, జల్‌జీవన్ మిషన్ కింద పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నిధులు విడుదల చేస్తే నీటి సమస్య పరిష్కారమవుతుందని సిఎంకు విన్నవించారు. ఇందుకు సిఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'పివికెకె'లో ఘనంగా ఫ్రెషర్స్ డే

అనంతపురం : స్థానిక రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి డిప్లొమా కళాశాలలో 2వ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ టి.వెంకటేషులు ర్యాగింగ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతో తల్లిదండులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్, కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, బాలాజీ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుబ్బారావు, పివికెకె ఐటి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఎఒ కె.మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : గుమ్మనూరు ఈశ్వర్

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఈశ్వర్

గుత్తి : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టిడిపి గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్స్టిట్యూట్ క్రీడా మైదానంలో గౌతమీపురి ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ అంతరాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఇందులోఉ భాగంగా ఆత్మకూరు-ఎర్రగుంట్ల జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడగా ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు షీల్డ్, రూ.50వేలు నగదు, రన్నర్స్ జట్టు ఎర్రగుంట్ల రూ.25వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభ పిళ్ళై, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్, బి.రమేష్, టిడిపి నాయకులు ఆర్ఎస్ రాజా, బి.మారుతీప్రసాద్, సాంబశివ యాదవ్, మండల నాగరాజు,న్యాయవాది సోము డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు కోన రంగనాథ స్వామి ఆలయ కమిటీ నియామకం

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఆలూరు కోన రంగనాథ స్వామి దేవస్థానం నూతన అలయ కమిటీని దేవదాయ శాఖ డివిజన్ అధికారి వన్నూరుస్వామి, ఇఒ రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం నియమించారు. ఈమేరకు ఛైర్మన్‌గా రంగనాయకులు, సభ్యులుగా ఆర్.నాగలక్ష్మమ్మ, శంకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, కిరణ్‌కుమార్, సుబ్బారావు, వెంకటనారాయణ, నాగలక్ష్మమ్మ, పద్మ, సరస్వతి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు.

నాయకత్వ లక్షణాలున్న యువతతోనే దేశాభివృద్ధి

మై భారత్ రాష్ట్ర సమన్వయకర్త బిసాతి భరత్‌ను సన్మానిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం : నాయకత్వ లక్షణాలు కలిగిన యువతే దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తారని మై భారత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయకర్త బిసాటి భరత్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల సెంట్రల్ హాల్లో మెడికల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ షారోన్ సోనియా, ఫౌండేషన్ కోర్స్ ఇన్‌ఛార్జి ఫార్మకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పద్మ శ్రావణి ఆధ్వర్యంలో 'నాయకత్వ లక్షణాలు – ఆవశ్యకత, మానవ సంబంధాలు, దేశాభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మానవ సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమాజంలో అభివృద్ధిని తీసుకొస్తామన్నారు. అంతేగాకుండా నాయకత్వ లక్షణాలు ఉన్న యువతతోనే వికసితభారత్ సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం వక్త బిసాటి భరత్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫార్మకాలజీ సహాచార్యులు పద్మ శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కురుబ జయమారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

మృతిచెందిన సుజాత

బెలుగుప్ప : తీవ్రమైన కడుపునొప్పిని భరించలేక వెన్నపూసల సుజాత (49) చీనీ చెట్లకు కొట్టే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెన్నుపూసల రామ్మోహన్‌రెడ్డి భార్య సుజాత తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండేది. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈనేపథ్యంలోనే శుక్రవారం ఉదయం కూడా తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. భరించలేక చీనీ చెట్ల కొట్టే పురుగు మందు తాగింది. అపస్మారకస్థితికి చేరుకున్న సుజాతను హుటాహుటిన అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలు తమ్ముడు నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుళ్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైసిపి సర్పంచుల తీరు దుర్మార్గం

ప్రజాశక్తి-పుట్లూరు

పారిశుధ్య కార్మికుల వేతనాలు, వీధిలైట్ల కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా కొంతమంది వైసిపి సర్పంచులు కేవలం వారి బిల్లులకే ప్రాధాన్యత ఇవ్వడం దుర్మార్గమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. మొదటగా తమ బిల్లులు చెల్లించాలనే ధోరణి అవలంబించడం ప్రజాస్వామ్యంతోపాటు పేద కార్మికుల జీవనానికి తీవ్రమైన అన్యాయమన్నారు. ముఖ్యంగా గ్రామాలను రోజూ ఉదయం లేవగానే శుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా ప్రజల రక్షణ, గ్రామాల అభివృద్ధికి అత్యవసరమైన వీధిలైట్లకు కూడా నిధులు కేటాయించకుండా, కేవలం తమ చేసిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలనుకోవడం మంచిది కాదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి త్యాగం చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ప్రజల భద్రతకు అవసరమైన వీధిలైట్లు వంటి వాటికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

దసరా కవిగోష్టిలో 'ఆకుల'కు సన్మానం

ప్రజాశక్తి-నార్పల

కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బల్లాపూర్ జిల్లాలోని చేలూరు తాలూకాలో ఉన్న మానస కళాశాల ఆడిటోరియంలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దసరా కవిగోష్టిలో తానా కవితా పురస్కార గ్రహీత ఆకుల రఘురామయ్యను ఘనంగా సత్కరించారు. తెలుగు, తమిళం, కొంకిణి, హిందీ, కన్నడ బహుభాషలకు చెందిన ప్రముఖ కవుల సమ్మేళనంతో దసరా కవిగోష్టి నిర్వహించారు. ఈ కవిగోష్టిలో 'ఆయుధ పూజ' అనే కవిత గానం చేసిన రఘురామయ్య తెలుగు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో రఘురామయ్య ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

వైద్యం కోసం ఆర్థికసాయం

ప్రజాశక్తి-శింగనమల

అనారోగ్యంతో బాధపడుతున్న శింగనమలకు చెందిన షంషీర్‌వలికి మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు శనివారం ఆర్థికసాయం అందించారు. అనారోగ్యానికి గురైన షంషీర్‌వలి అనంతపురంలోని స్వర ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న దండు శ్రీనివాసులు బాధితుడి వైద్యం కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆదినారాయణ, రాజాబాబు, కాయల సురేష్‌యాదవ్, డీలర్ మసూద్‌వలి, ఆర్శీ జీలాన్, మసూద్‌వలి, మాబు, నూర్, తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు పిచికారితో పంట నాశనం

బొమ్మనహాళ్ : క్రిమిసంహారక మందు పిచికారి చేయడంతో దాదాపు మూడెకరాల పొలంలో వరిపంట పూర్తిగా నాశనమైందని మండల పరిధిలోని కొళగానహళ్లికి చెందిన రైతు కావలి రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. వరి పంటకు ఆశించిన పురుగు నివారణకు కృష్ణాపురంలో కొనుగోలు చేసిన క్రిమిసంహారక మందులను మూడెకరాల వరి పంటకు పిచికారి చేశానన్నారు. దీంతో పంట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే మందుల దుకాణం యజమాని క్రిమిసంహారక మందుకు సంబంధించి బిల్లు ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.

కుక్కలకు రేబిస్ టీకాలు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముప్పులకుంట గ్రామంలో దాదాపు వంద కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. గ్రామానికి చెందిన నేత్రపల్లి శివకుమార్ గత సోమవారం అనంతపురంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి కుక్కలకు టీకాలు వేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే ముప్పులకుంటలో టీకాలు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో వైద్యాధికారులు గ్రామానికి చేరుకుని కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి నాగబాబు, ఎహెచ్‌ఎ రమణనాయక్, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, మాజీ సర్పంచు చిత్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

గుంతకల్లు కౌన్సిల్ మీట్‌లో సభ్యులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పారిశుధ్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని మెజారిటీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కౌన్సిల్ సమావేశం భవనంలో ఛైర్‌పర్సన్ నగినేని భవాని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కౌన్సిలర్లు రామగౌని పవన్‌కుమార్ గౌడ్, కుపాకర్,లింగన్న తదితరులు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా లేకపోవడంతో చెత్తకుప్పలు పేరుకుపోయి కాలనీలు కంపుకొడుతుఉన్నాయన్నారు. దీంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షాలకు మురుగు కాలువలు నిండి ఇళ్లల్లోకి నీరు వస్తోందన్నారు. దీనికితోడు కుక్కల బెడదను నివారించాలని, ఆవులు రోడ్లపై లేకుండా గోశాలకు తరలించాలని అనేకమార్లు కమిషనర్ దృష్టికి తెచ్చినా స్పందన లేదన్నారు. రోడ్లన్నీ గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని మండిపడ్డారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద మున్సిపల్ స్థలంలో కొందరు గుడిసెలు వేసుకుని ఉంటూ ప్రజలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో చేపలు పడుతూ నీరు కలుషితం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇందుకు ఉప కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి సమాధానమిస్తూ పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని,కుక్కలకు వ్యాక్సిన్ వేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గోవుల యజమానులకు ఇప్పటికే రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చామని మరొక్కసారి నోటీసులు ఇస్తామని ఐనా వారు స్పందించకపోతే గోవులను గోశాల ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తామన్నారు. అనంతరం కౌన్సిలర్లు అజెండాను ఆమోదిస్తున్నామని చెప్పడంతో ఛైర్‌పర్సన్ భవాని సమావేశాన్ని ముగిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మేనేజర్ ఎం.రాధ, ఎఇ ఇంతియాజ్ అలీ, మెప్మా ప్రాజెక్టు అధికారి మోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని

కులగణన చేపట్టాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం

జనగణనలో కుల గణన చేపట్టి బీసీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని పలు రాజకీయ, కులసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా ఐదు నుంచి 15 శాతం మధ్యలో ఉన్న అగ్రకులాల నాయకులు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారన్నారు. అయితే 50 నుంచి 70 శాతం మధ్యలో ఉన్న బీసీ కులాల నాయకులు చిన్నచిన్న పోస్టులకు పరిమితమయ్యారన్నారు. కావున జనాభా ప్రాతిపదికన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, మాజీ ఎంపి తలారి రంగయ్య, విశ్రాంత జడ్జి కిష్టప్ప, మాజీ మేయర్ రాగే పరశురాం, సిపిఎం నాయకులు బాలరంగయ్య, కాంగ్రెస్ నాయకులు సాకే శంకర్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

యాడికి : మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు తెలిపారు. స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు పరమేశ్వర్, సాయి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నిట్టూరు గ్రామ సచివాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభాకుమారి, ఎఎన్‌ఎంలు సరస్వతి, రాజామణి, ఎంఎల్‌హెచ్‌పిలు హర్షిత, శ్వేత, మాధురి పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాలవెంకటాపురం, కోనాపురం గ్రామాల్లో శనివారం స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. తర్వాత పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో కోనాపురం సర్పంచు మల్లెల వనితా మల్లికార్జున, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ, రంగనాయకులు, టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షులు ఓబులేసు, నోడల్ ఆఫీసర్ ఆష్రాఫ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణిఎస్తేర్, సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో వయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ వాలంటీర్లకు శనివారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం అక్షర కేంద్రాల వాచకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేషారెడ్డి, ఎపిఎం తిప్పమ్మ, ఎపిఓ రమేష్ రామారావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిసిలు, యానిమేటర్లు, వాలంటీర్ టీచర్లు ఉన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

నార్పల : పెరటికోళ్ల పెంపకంతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వెలుగు డిపిఎం గంగాధర్ సూచించారు. హీఫర్, నవజీవన్ సహకారంతో శనివారం స్థానిక రైతు నేస్తం రైతు సంఘం కార్యాలయంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ షర్మిల అధ్యక్షతన రైతు సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు ఉచితంగా నాటుకోడి పిల్లలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ, రైతు సంఘం, నవజీవన్ సిబ్బంది, రైతు సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

రాప్తాడు : మండలంలోని రాప్తాడు-2 రైతు సేవా కేంద్రంలో టిడిపి మండల కన్వీనర్ పంపు కొండప్ప ఆధ్వర్యంలో రైతులకు శనివారం యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు తిరుపాలు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గంగుల కిష్టప్ప, వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, ఎఇఓ సుజిత, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యూరియాపై దద్దరిల్లిన సర్వసభ్య సమావేశం

పారదర్శకంగా పంపిణీ చేపట్టాలి-జడ్పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో యూరియా పంపిణీపై పలువురు సభ్యులు గళం విప్పారు. మొదట వ్యవసాయ శాఖపై ప్రారంభమైన చర్చలో భాగంగా యూరియా అవకతవకలపై వైసీపీ జడ్పిటిసి భోగాతి విజయప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలో 14 రైతు సేవ కేంద్రాలు ఉండగా కల్లూరు, గొడ్డుమర్రి, దంతలపల్లి, చింతకాయమంద, 85 నిట్టూరు, మల్లేపల్లి, చిలమకూరు కేంద్రాలకు వ్యవసాయ అధికారులు ఇంటెంట్ పంపి యూరియా అందిస్తున్నారని, వెన్నపూసపల్లి రైతు సేవాకేంద్రం పరిధిలో రైతులు లేరా, వారికి యూరియా అవసరం లేదా.. అంటూ ప్రశ్నించారు. ఇందులో తెలుగుదేశం నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారా.. చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే యల్లనూరు రైతు సేవా కేంద్రం, వ్యవసాయ సహకార సంఘం సొసైటీల్లో రెండు చోట్లా యూరియా ఎలా పంపిణీ చేస్తారని సొసైటీ సిఇఒను ప్రశ్నించారు. దీంతో వ్యవసాయ అధికారులు సమాధానం చెప్పలేకపోయేసరికి జెడ్పిటిసి సమావేశం నుంచి వెళ్లిపోయారు. అలాగే అచ్యుతాపురంలోని అంగన్వాడీ కేంద్రన్ని ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని చిలమకూరు ఎంపిటిసి గోపాల్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంగాదేవి, ఎంపిడిఓ కరుణాసాగర్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి భోగాతి

'లోక్ కళ్యాణ్‌మేళా'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పరిధిలోని చిరువ్యాపారుల సంక్షేమానికి తీసుకొచ్చిన ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి 2.0 (లోక కళ్యాణ్‌మేళా) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళ శిల్ప సూచించారు. శనివారం పట్టణంలోని సీతారామాంజనేయ సత్రంలో 'లోక కళ్యాణ మేళా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద రుణాలు పొందిన వారు లబ్ది పొందడంతోపాటు రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి, పట్టణ పేదరిక నిర్మూలన పథకం టిఎంసి నారాయణరెడ్డి మాట్లాడుతూ 'లోక కళ్యాణ్ మేళా'లో రూ.25వేల ఆర్థికసాయం కోసం 154, రూ.50 వేల కోసం 72 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అర్హులందరికీ త్వరలోనే బ్యాంకు రుణాలు మంజూరవుతాయన్నారు. ఎలాంటి పూచికత్తు లేకుండా మంజూరయ్యే రుణాలను డిజిటల్ చెల్లింపుల ద్వారా లావాదేవీలు నిర్వహించడం వల్ల ప్రతి లబ్దిదారునికీ నెలకు రూ.100 చొప్పున ఏడాదికి రూ.1200 ప్రోత్సాహక రాయితీ లభిస్తుందన్నారు. అంతేకాక రుణాలపై ఏడు శాతం తిరిగి చెల్లించనున్నట్లు వివరించారు. కాగా లోక కళ్యాణ్‌మేళాలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 107 మంది చిరు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సిడిపిఓ ఎల్ పద్మావతి పోషణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వార్డు సభ్యులు జ్యోతి, పద్మజ, ప్రశాంతి, శారద, టిడిపి నాయకులు భారతి, హనుమంతు, కృష్ణమూర్తి, లోకేష్, భారతీయ స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు మిషన్లు పంపిణీ

బొమ్మనహాళ్ : మండలంలోని చౌకధాన్యం డీలర్లకు శనివారం నూతన ఇపిఎం మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జున, డీలర్ సంఘం అధ్యక్షుడు వయ్యావుల మోహన్, ఉపాధ్యక్షులు స్వామి, డీలర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం : స్థానిక కార్యాలయ ఆవరణలో ఉన్న రెవెన్యూ మీటింగ్ హాలులో రాయదుర్గంతోపాటు గ్రామీణ ప్రాంతంలోని చౌక దుకాణ డీలర్లకు కొత్త పిఒఎస్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, డీలర్లు పాల్గొన్నారు.